సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 9 । జూలై । 2023

ఆత్మబంధువుకు ఆత్మీయ నివాళి



బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, నాగిరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల తదితరులు



68వ వార్డు మిందిలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీ నేతలు అన్ని నియోజకవర్గాల్లో మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి.. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. పేదలకు దుస్తులు, నిత్యావసర సరకులు.. వృద్ధాశ్రమాలు, అనాథశ్రమాల్లో అన్నదానాలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బీచ్‌రోడ్డులో..: వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయ కర్త, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేట్ కట్ చేసి పేదలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలోని జనరేషన్ యువ ఆశ్రమంలో అన్నదానం



ప్రియతమ నేతకు పుష్పాంజలి: 39వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళలు

విశాఖ అభివృద్ధిలో వైఎస్సార్‌ది చెరగని ముద్ర

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డి



రక్తదానం చేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ, అల్లంపల్లి రాజబాబు, పేడాడ రమణికుమారి



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ మంత్రి బాలరాజు, పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగర అభివృద్ధికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పరితపించిన గొప్ప వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు గ్రేటర్ హోదా, ఐటీ అభివృద్ధి, విమ్స్ నిర్మాణం, పేదలందరికీ గూడు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, జోనల్ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు, పేడాడ రమణికుమారితో పాటు సుమారు 100 మంది రక్తదానం చేశారు. ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, ఎస్.ఎ.రెహ్మాన్, కుంభా రవిబాబు, కార్పొరేషన్ చైర్మన్లు బొల్లవరపు జాన్ వెస్లీ, కోలా గురువులు, చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, పిల్లి సుజాత, పిల్లా సుజాత, మాధవీవర్మ, పల్లా చిన్న తల్లి, ముఖ్య నాయకులు సీతంరాజు సుధాకర్, రవిరెడ్డి, వుడా రవి, సతీష్ వర్మ, శ్రీకాంత్‌రాజు, కాశీ విశ్వనాథం, జోనల్ ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజబాబు, పీలా వెంకటలక్ష్మి, తుల్లి చంద్రశేఖర్, ఆల్ఫా కృష్ణ, కలిదిండి బద్రీనాథ్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

మార్గ నిర్దేశకుడు వైఎస్సార్

- పేదలకు ఉన్నత విద్య, మంచి వైద్యాన్ని చేరువ చేశారు
- ఏయూలో మహానేత కాంస్య విగ్రహం ప్రారంభించిన వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి వందనం చేస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: పేదలకు ఉన్నత విద్య, వైద్యాన్ని చేరువ చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని శనివారం సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదవాడికి ప్రభుత్వం అండగా నిలవాలని మహానేత ఆకాంక్షించేవారని.. దానిని ఆచరణలో చూపుతూ నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత ఎక్కువ సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ఏయూ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తర్వాత ఏయూ ఉద్యోగులు, ఆచార్యులు, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ఇక్కడ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.శేషారెడ్డి సహాయంతో అదే స్థానంలో కాంస్య విగ్రహం ఏర్పాటైందన్నారు. అనంతరం వై.వి.సుబ్బారెడ్డి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఏయూలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శేషారెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ టి.శోభశ్రీ, అకడమిక్ డీన్ ఎస్.కిశోర్ బాబు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఏయూ ఎస్సీ,ఎస్టీ బీసీ సీ ఆచార్యుల సంఘం అధ్యక్షుడు ఆచార్య పి.అర్జున్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, డాక్టర్ శోభా స్వాతి రాణి, ఏయూ ఆచార్యులు, పరిశోధకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

40 ఎకరాలు.. 300 లగ్జరీ విల్లాలు

- భీమిలి మండలం అన్నవరం తీరంలో ఒబెరాయ్ విలాస్ రిసార్ట్
- రూ.350 కోట్ల ప్రాజెక్టుతో 5,500 మందికి ఉపాధి అవకాశాలు
- వర్చువల్ విధానంలో నేడు 'ఒబెరాయ్' కు సీఎం జగన్ శంకుస్థాపన
- జీఐఎస్–2023 ఒప్పందాల్లో విశాఖలో తొలి ప్రాజెక్టుకు శ్రీకారం



ఒబెరాయ్ లగ్జరీ విల్లాల నమూనా



శంకుస్థాపన కార్యక్రమానికి చురుగ్గా ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : పర్యాటక రంగంలో పరుగులు పెడుతున్న విశాఖ వైపు దిగ్గజ సంస్థలు అడుగులు వేస్తున్నాయి. హోటళ్ల రంగంలో దిగ్గజమైన ఒబెరాయ్ సంస్థ విశాఖలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు శ్రీకారం చుడుతోంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో జరిగిన ఒప్పందంలో భాగంగా భీమిలి మండలం అన్నవరం సమీపంలో 40 ఎకరాల్లో రూ.350 కోట్ల వ్యయంతో సెవెన్‌స్టార్ లగ్జరీ విల్లాలు, రెస్టారెంట్స్ తదితర సౌకర్యాలున్న ప్రాజెక్టు శంకుస్థాపనకు రంగం సిద్ధం చేసింది. ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 5,500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కలగనుంది.


అన్నవరంలో సెవెన్‌స్టార్ లగ్జరీ విల్లాలు

భీమిలి మండలం అన్నవరం సముద్ర తీరం సమీపంలో పర్యాటక శాఖకు సంబంధించి సర్వే నెంబర్ 108లో ఉన్న 40 ఎకరాల భూమిని లీజు పద్ధతిలో ఒబెరాయ్‌కు అప్పగించారు. ఇక్కడ సెవెన్‌స్టార్ లగ్జరీ విల్లాలు, రెస్టారెంట్స్ నిర్మించాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా తయారు చేసింది. ఇక్కడ కళ్లు మిరుమిట్లు గొలిపేలా 300 ఇండిపెండెంట్ విల్లాలు, రెస్టారెంట్స్, ఫైన్ డైనింగ్, 24 గంటల కాఫీషాప్, కాన్ఫరెన్స్ ఫెసిలిటీ, బాంక్వెట్ హాల్, బార్ అండ్ లాంజ్, లాబీ, గెస్ట్ రిసెప్షన్ ఏరియా స్విమ్మింగ్ పూల్, ఫిట్‌నెస్ సెంటర్, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ స్పా, సావనీర్ షాపులు, ఓపెన్ లాన్స్, పార్టీ ఏరియాతో పాటు మరిన్ని లగ్జరీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానుంది.

ఒబెరాయ్ గ్రూప్స్ అంటే.?

భారత్‌కు చెందిన ఒబెరాయ్ గ్రూప్ 5 స్టార్ లేదా 7 స్టార్ హోటల్స్ రంగంలో అగ్రగామిగా వెలుగొందుతోంది. ఐదు దేశాల్లోని 20కిపైగా నగరాల్లో హోటల్స్‌ను, 2 క్రూయిజ్ షిప్‌లను నిర్వహిస్తోంది. 1934 నుంచి హోటల్స్ రంగంలో సేవలందిస్తూ అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. భారత్‌లో ముంబయి , గుర్‌గావ్, చెన్నై, భువనేశ్వర్, కొచ్చి, ఆగ్రా, జైపూర్, ఉదయ్‌పూర్, హైదరాబాద్ నగరాల్లో మాత్రమే హోటళ్లను నడుపుతోంది. తాజాగా విశాఖలో తన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది.

పర్యాటక రంగంలో జోష్



ఒబెరాయ్ హోటళ్ల ప్రాజెక్టు పూర్తయితే విశాఖ పర్యాటక రంగానికి మరింత జోష్ వస్తుంది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు, ఏపీ టూరిజం పాలసీ ఆధారంగా ఒబెరాయ్ సంస్థకు రాయితీలు కల్పిస్తూ నియమ నిబంధనలు విధించాం. పీపీపీ మోడ్‌లో ల్యాండ్ ఆన్ లీజ్ పద్ధతిలో భూ కేటాయింపులు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 5,500 మందికి ఉపాధి కలగడంతో పాటు.. మరో వెయ్యి నుంచి 2 వేల వరకూ స్థానిక ప్రజలకు పరోక్ష ఉపాధి లభిస్తుందని భావిస్తున్నాం. ఒబెరాయ్ సంస్థ నాలుగేళ్ల కాలంలో దశలవారీగా ప్రాజెక్టును పూర్తి చేయనుంది.

– డా.ఎ.మల్లికార్జున, కలెక్టర్

ఏఆర్ ఆర్‌ఐ, కానిస్టేబుల్ సస్పెండ్

దొండపర్తి: నోట్ల మార్పిడి దందా వ్యవహారంలో అరెస్ట్ అయిన ఏఆర్ ఆర్‌ఐ(హోంగార్డ్స్) స్వర్ణలతపై సస్పెన్షన్ వేటు పడింది. ఆమెతో పాటు కేసులో ఏ2గా ఉన్న ఎం.హేమ సుందర్‌ను కూడా సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.90 లక్షల విలువ గల రూ.500 నోట్లు ఇస్తే.. రూ.కోటి విలువ గల రూ.2 వేల నోట్లు ఇస్తామని ఇద్దరు రిటైర్డ్ నేవల్ ఆఫీసర్లను మోసం చేసిన విషయం తెలిసిందే. బాధితులను బెదిరించి వారి నుంచి రూ.15 లక్షలు బలవంతంగా వసూలు చేసిన వ్యవహారంలో పోలీసులు ఆర్‌ఐ స్వర్ణలతతో పాటు మధ్యవర్తి సూరిబాబు, ఏఆర్ కానిస్టేబుల్ హేమసుందర్, హోంగార్డ్ శ్రీనివాసులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఐతో పాటు కానిస్టేబుల్‌పై సీపీ చర్యలకు ఉపక్రమించారు.

వాతావరణ పరిస్థితులకు అనుకూలంగానే ప్రాజెక్టులు



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, తిరుపతి మేయర్ శిరీష

డాబాగార్డెన్స్: ప్రపంచ వ్యాప్తంగా గల నగరాల్లో వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పలు ప్రాజెక్టులు తయారు కావాలని, అవి ఆయా స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలపైనా ప్రభావం చూపుతాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న జీ–20, అర్బన్–20 సదస్సులో భాగంగా శనివారం వాతావరణ ప్రాజెక్టులపై ఆమె ప్రసంగించారు. వాతావరణ ప్రాజెక్టులను అమలు చేసేందుకు నగరాల సామర్థ్యాన్ని పెంచడమే ప్రస్తుతం మన చేతిలో ఉన్న సవాల్‌గా అభివర్ణించారు. క్లైమేట్ ఫైనాన్స్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం ప్రోత్సహించేందుకు విశాఖ ప్రయత్నాలు చేస్తుందని స్పష్టం చేశారు.

నృత్యోత్సవం.. సమ్మోహనభరితం



వర్షిణి (కూచిపూడి), శరణ్య ఎస్.కుమార్(భరత నాట్యం), అణిణ్య జూడాగాడే (ఒడిస్సీ), ప్రణవం స్కూల్ ఆఫ్ డాన్స్ బృందం(మోహినియాట్టం) ప్రదర్శనలు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సత్యభామ నృత్యోత్సవం శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సమ్మోహనభరితంగా ప్రారంభమైంది. అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ గౌడ్ నేతృత్వంలో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ నృత్యోత్సవాన్ని తొలి రోజు ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ సుడగాని రవిశంకర్ నారాయణ్, జాయింట్ కమిషనర్(సీజీఎస్టీ) మహ్మద్ అలీ, శంకర్‌పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా కూచిపూడి అగ్రహానికి చెందిన యక్షగాన ప్రావీణ్యుడు వేదాంతం వాగ్దేవి ప్రసాద్‌కు వేదాంతం లక్ష్మీనారాయణ యువ పురస్కారం, దుబాయికి చెందిన తెన్నేటి శ్రావణికి డాక్టర్ శోభానాయుడు యువ పురస్కారం, సత్యభామ టీచర్ అవార్డును అరుణా పరమేష్‌కు ప్రదానం చేశారు. అనంతరం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఏపీ ప్రిన్సిపాల్ కూచిపూడి నాట్య సోయగంతో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. కూచిపూడి నృత్యంతో వర్షిణి, భరతనాట్య విన్యాసంతో తెలంగాణకు చెందిన శరణ్య ఎస్.కుమార్‌లు అద్భుత ప్రదర్శనలిచ్చారు. మాయారాణీస్ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ బృందం ప్రదర్శించిన నాట్యం, యూఏఈకి చెందిన శ్రావణి నృత్య పరికల్పనలో అన్నమయ్య కృతులకు నాట్యాభినయం అందరినీ ఆకట్టుకుంది.

వేంకటేశ్వర స్వామి వైభవాన్ని చాటుతున్నాం

- హిందూ ధర్మప్రచారంలో భాగంగా ఆలయాల నిర్మాణం
- టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, వీసీ ప్రసాదరెడ్డి, యార్లగడ్డ

ఏయూక్యాంపస్: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని చాటే దిశగా నిరంతరం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఏయూ హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామిపై ఏయూ విశ్రాంత ఆచార్యులు సూర్యదేవర సత్యనారాయణ రచించిన 'ఓం నమోవెంకటేశాయ–మోక్షదాయక, గోవిందా హరి గోవిందా–పుణ్యదాయకం' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తక రచయితకు టీటీడీ తరపున అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. టీటీడీ పుస్తక విక్రయ కేంద్రాల్లో ఈ పుస్తకాలను విక్రయించే చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు చేరువలో ఆలయాలను నిర్మించడం, స్వామి వారి ఉత్సవాలు, కల్యాణాలు చేసే విధంగా కృషిచేస్తున్నామన్నారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన విధంగా దేశ వ్యాప్తంగా వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. సామాన్య భక్తులకు సైతం స్వామిని చేరువ చేసే విధంగా తిరుమలను అభివృద్ధి చేశామన్నారు. పూర్వ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ సామాన్య భక్తులకు టీటీడీ పెద్దపీట వేస్తోందన్నారు. విదేశాలలో సైతం వేంటేశ్వరస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. పుస్తక రచయిత ఆచార్య సూర్యదేవర సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీనివాసుని కృపతో ఈ పుస్తక రచన చేశానన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూలో చారిత్రక వెంకటేశ్వర ప్రేయర్ హాల్ అభివృద్ధికి చొరవ తీసుకుని నిధులు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఎస్.బాబయ్య పాల్గొన్నారు.

తెలుగు కథా సాహిత్యంలో కొత్త ఒరవడి

ఘనంగా వాట్సాప్ గ్రూప్ 'కథారవళి' ప్రథమ వార్షికోత్సవం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కథా రచయితలు

సీతంపేట: తెలుగు కథకులను ఓ చోట చేర్చి.. మారిన పరిస్థితులకు అనుగుణంగా సామాజిక మాధ్యమం ద్వారా సేవలందించడానికి ఏర్పడిన 'కథా రవళి'సంస్థ ప్రథమ వార్షికోత్సవం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. బెంగళూరులోని ప్రముఖ ఔషధ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నతోద్యోగం చేస్తూ, అవిశ్రాంతంగా తెలుగు సాహితీ సేవలు అందిస్తున్న డి.ఎస్.వి.రామశర్మ శ్రీదండెం రాజు ఫౌండేషన్ ద్వారా ఈ కథారవళి సంస్థను వాట్సాప్‌లో ఓ గ్రూప్‌గా స్థాపించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది కొత్త, పాతతరం కథా రచయితలు గ్రూపులో సభ్యులుగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, బిహార్, బెంగాల్, యానాం ప్రాంతాలకు చెందిన పలువురు తెలుగు రచయితలు తొలిసారిగా విశాఖ వేదికగా కలుసుకున్నారు. వేదికపై ఒకొక్కరుగా పరిచయం చేసుకున్నారు. వారి సాహిత్య సేవను వివరించారు. కథా రచయిత జె.పి.శర్మ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ప్రముఖ కథా నవలా రచయిత ఎ.ఎస్.జగన్నాథశర్మ, పి.చంద్రశేఖర్ ఆజాద్, శరత్‌చంద్ర, కొచ్చెర్లకోట జగదీష్, సి.హెచ్.సుశీలమ్మ, ప్రముఖ పాత్రికేయుడు జి.వల్లీశ్వర్ జ్యోతి ప్రజల్వన చేశారు. సమకాలీన పరిస్థితుల్లో తెలుగు సాహితీ పరిస్థితులను చర్చించిన ఈ సమావేశంలో నగరానికి చెందిన ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావును 'కథా భీష్మ'బిరుదుతో సత్కరించారు. ఎం.సుగుణరావు, కోనే నాగవెంకట ఆంజనేయులు, అంబల్ల జనార్దన్, నండూరి సుందరీనాగమణి, బుద్ధవరపు కామేశ్వరరావు, కొండూరు రామరాజులకు కథారవళి గౌరవ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలు రచయితలు చేసిన రచనలను ఆవిష్కరించారు. అనంతరం కథా రచయిత గుండాన జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు రచనలు సంబంధించి వివిధ విషయాలపై చర్చించారు. కొత్తగా రచనలు చేసే వారికి సలహాలు, మెళకువలు అందించారు. 120 మందికిపైగా పాల్గొన్న సమావేశం తెలుగు కథా రచయితల్లో కొత్త ఉత్సాహం నింపింది. కథా రచయితలంతా కలవడానికి విశేష కృషి చేసిన కథారవళి వ్యవస్థాపకుడు రామశర్మను అందరూ అభినందించారు. నగరానికి చెందిన సాహితీవేత్తలు మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు కార్యక్రమ నిర్వహణకు సహకారం అందించారు.

ఆంధ్రా హాస్పిటల్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



మాట్లాడుతున్న ఆంధ్రా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి

మహారాణిపేట: ఆంధ్రా ఆస్పత్రిలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి తెలిపారు. కేజీహెచ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆంధ్రా హాస్పిటల్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆంధ్రా హాస్పిటల్స్ ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తూ.. రాష్ట్రంలోనే పేరుగాంచిందన్నారు. అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో 40 మంది కన్సల్టెంట్లతో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సమావేశంలో సీనియర్ వైద్యులు డాక్టర్ శాంతారావు, సీనియర్ న్యూరో సర్జర్లు డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ సతీష్ కలిదిండి, సీనియర్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.